# ఆధునిక బస్సుల తయారీపై దృష్టి

## - బస్‌వరల్డ్ సదస్సులో టాటా మోటార్స్ సంస్థ ప్రతినిధుల వెల్లడి




మీడియాకు వివరాలను వెల్లడిస్తున్న సంస్థ ప్రతినిధులు

బెంగళూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశవ్యాప్తంగా ప్రజారవాణాకు డిమాండ్ పెరుగుతోందని ఈ నేపథ్యంలో మరింత సౌకర్యవంతమైన ఆధునిక బస్సుల తయారీపై దృష్టి సారించామని టాటా మోటార్స్ సంస్థ వెల్లడించింది. నగర శివారులోని బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో బుధవారం ప్రారంభమైన బస్‌వరల్డ్ సదస్సులో పాల్గొనేందుకు విచ్చేసిన టాటామోటర్స్ పాసింజర్ కమర్షియల్ వెహికల్ విభాగం హెడ్ రోహిత్ శ్రీవాత్సవ మీడియాతో మాట్లాడారు. భారత్‌లో బస్సు సేవల ప్రగతి గురించి సోదాహరణంగా వివరించారు.

మన దేశంలో తొలి బస్సు సేవ 1926లో ముంబైలో ప్రారంభమైంది. గత దశాబ్దకాలంలో ప్రజారవాణాలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం దేశ బస్ పరిశ్రమ రంగంలో టాటా మోటార్స్ 36 శాతం వాటాను కలిగి ఉంది. దేశంలో బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. దేశ జనాభాలో ప్రస్తుతం 12.5 శాతం మంది బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. 2020 నాటికి ఇది 15 శాతం దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా దేశంలో తొలి ఫ్యూయెల్ సెల్ బస్సు హుబ్లి ధార్వాడ్‌ల మధ్య సంచరించనుందని దీనికి తామే రూపకల్పన చేశామని సంస్థ మార్కెటింగ్ హెడ్ సందీప్‌కుమార్ వెల్లడించారు. బస్ వరల్డ్ ప్రదర్శనలో తాము సిద్ధం చేసిన స్టార్‌బస్ అల్ట్రా ఎసి 22 సీటర్ పుష్ బ్యాక్‌తో పాటు పలు వాహనాలను ఉంచామని తెలిపారు. దక్షిణాదిన ప్రత్యేకించి కర్నాటకలో ప్రజలు అత్యధికంగా బస్సుసేవలను వినియోగించుకుంటున్నారని ఆయన వివరించారు.

# వినాయకచవితికి నగరం నుంచి ప్రత్యేక బస్సులు